### తల్లికి వందనం ఎప్పుడిస్తారు..?



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏటా రూ. 15 వేలు ఇస్తామన్నారు. ఇప్పటికీ అతీ గతీ లేదు. దానిపై ప్రస్తావనే లేదు. మా అబ్బాయి 6వ తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. పిల్లలను బడికి పంపే తల్లులందరూ ఎదురుసూస్తున్నారు.

– విజయకుమారి, నబీకోట, కడప

### నిరుద్యోగ భృతి ఏమైంది..?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికి ఉద్యోగం లేకపోతే నిరుద్యోగభృతిని కల్పిస్తానంటూ హామీ ఇచ్చారు. కానీ నిరుద్యోగ భృతిని వెంటనే కల్పిస్తే మంచిది. నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. ప్రభుత్వ ఉద్యోగమైనా సరే లేకపోతే నిరుద్యోగ భృతిని ఇవ్వాలి.

– సుకన్య, శాస్త్రినగర్, కడప

### మహిళలకు రూ. 1500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ. 1500 ఇస్తామని ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల వేళ ప్రతి సభ, సమావేశాలలో కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అందలం ఎక్కాక ఆ ఊసే లేకుండా పోతోంది. హామీలు ఇచ్చాక మరచిపోతే ఎలా.. నాతో పాటు మహిళలందరూ రూ. 1500 ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు.

– ఎం. లక్ష్మీ ప్రసన్న, రవీంద్రనగర్, కడప

### మూడు సిలిండర్లు ఏమయ్యాయి.?



ప్రతి ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు ఈ అంశంపై ప్రచారం చేశారు. ఇప్పుడేమే దాని గురించే మరచిపోయారు. పేదలందరం గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇంత మోసం చేస్తారని అనుకోలేదు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు.

– బి. అంజనాదేవి, అక్కాయపల్లి, కడప

### పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వరా..?



ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభం అయింది. పంటలు సాగు చేసుకోవాలి. వర్షాలు కూడా పడుతున్నాయి. గతంలో సీఎం జగన్ ఉన్నప్పుడు ఈ పాటికి మాకు రైతు భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా చెప్పిన సమయానికి ఇచ్చి రైతులను ఆదుకున్నారు. టీడీపీ నేతలు అన్నదాతా సుఖీభవ.. కింద రూ. 20 ఇస్తామన్నారు. అతీ గతీ లేదు. రైతులంటే ఇంత అలుసా..?

– ఎల్. నరసింహులు, రైతు, కడప

### ఉచిత బస్సు ఏమైందో



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పింది. ఇప్పటికీ దానిపై ప్రస్తావనే లేదు. అధికారంలోకి వచ్చాక హామీలన్నీ గాలికి వదిలేశారు. చేయలేనపుడు ఎందుకు హామీ ఇవ్వాలి.

– క్రిస్టి ఇష్మిత, కడప




ప్రతి మహిళకు నెలకు
రూ. 1500

కడప నియోజకవర్గంలో అర్హులైన మహిళలు : 95,000

వీరికి నెలకు కేటాయించాల్సిన నిధులు రూ. 14.25 కోట్లు

# బాబు ష్యూరిటీ..
# మోసం గ్యారెంటీ

## సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



'అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకం ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.



టీడీపీ ఒక్కో ఏడాదికి
**అన్నదాతా సుఖీభవ**కు
అందాల్సిన సాయం

| కడప నియోజకవర్గంలో అర్హులైన రైతులు | ఏడాదికి సాయం రూ.కోట్లు |
|---|---|
| 1714 | 3.42 |



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి
**తల్లికి వందనం**
అందాల్సిన సాయం

| కడప నియోజకవర్గంలో అర్హులు | కేటాయించాల్సిన నిధులు రూ.కోట్లు |
|---|---|
| 37,476 | 56.21 |



నిరుద్యోగ భృతి

కడప నియోజకవర్గంలో నిరుద్యోగులు: 40 వేలు

వీరికి నెలకు కేటాయించాల్సిన నిధులు: రూ. 12 కోట్లు



మహిళలకు
ఉచిత
బస్సు ప్రయాణం

కడప నియోజకవర్గంలో మహిళలు
2,01,694

నోట్: జనాభా లెక్కల ప్రకారం



ప్రతి ఇంటికి
3 గ్యాస్ సిలిండర్లు

కడప నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలు: 83791

మూడు గ్యాస్ సిలిండర్లకు ఏడాదికి అయ్యే ఖర్చు: రూ.21.62 కోట్లు

### హామీ మేరకు రూ. 1500 ఇవ్వాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ. 1500 ఇచ్చి ఆదుకోవాలి. పేద వర్గాలకు ఈ ఆర్థికసాయం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విషయంగా మహిళా లోకం ఎదురు చూస్తోంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నాం.

– పి.రోజా, కృపాకాలనీ, కడప

### గ్యాస్ సిలిండర్లు అందించాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించాలి. పేద, మధ్య తరగతి వర్గాలు చంద్రబాబు మాటను నమ్మి అధికారాన్ని కట్టబెట్టారు. సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. సూపర్‌సిక్స్‌లో పెట్టిన ఈ పథకాన్ని వెంటనే అమలు చేసి తీరాల్సిందే.

– సునీతకుమారి, కడప

### అప్పులు తెచ్చుకుని...



ప్రభుత్వం రైతులకు విడుదల చేయాల్సిన అన్నదాత సుఖీభవ నిధులను తక్షణం విడుదల చేయాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావస్తుంది. ఇప్పటికే చాలా మంది రైతులు పంటల సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో నిధులు విడుదల చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆలస్యమైతే రైతులు అప్పులు తెచ్చుకుని పంటలను సాగు చేసుకునే పరిస్థితి ఉంటుంది.

– బచ్చుల వెంకటసుబ్బయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు


### తల్లికి వందనం డబ్బు కోసం ఎదురుచూస్తున్నా..



మాది కడప నక్కాస్ ప్రాంతం. నా కుమారుడు, కోడలు అనారోగ్యంతో గతంలోనే మృతి చెందారు. దీంతో నా మనవడిని నా దగ్గరే పెట్టుకుని నేను బేల్దారి పనికి వెళుతూ చదివించుకుంటున్నా. నా మనవడు ఇప్పుడు 9వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం పాఠశాల తెరవంగానే అమ్మకు వందనం డబ్బులు ఇచ్చి ఉంటే వాడికి కావాల్సిన విద్యా సామాగ్రితోపాటు కొత్తబట్టలు కొని బడికి పంపేవాడిని. కానీ నేడా పరిస్థితి లేదు. నాకు వచ్చే కూలి డబ్బులు మాకు పూటగడవటానికే సరిపోతుంది. ఇక ఎక్కడ డబ్బులు పెట్టి పిల్లోడికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అమ్మకు వందనం డబ్బులు ఇస్తే నా మనవడికి కావాల్సిన వాటిని కొని ఇస్తాను.

– రాములమ్మ, నక్కాసు, బేల్దారి కూలీ, కడప

## రైతు భరోసా



కడప నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా కింద విడుదలైన నిధులు

| సంవత్సరం | రైతుల సంఖ్య | విడుదలైన నిధులు (కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 2,634 | 3,55,59,000 |
| 2020-21 | 2,154 | 2,90,79,000 |
| 2021-22 | 1,962 | 2,64,87,000 |
| 2022-23 | 1,679 | 2,26,66,500 |
| 2023-24 | 1,714 | 2,31,39,500 |

## అమ్మ ఒడి



కడప నియోజకవర్గంలో ఏడాదిలో వచ్చిన నిధుల వివరాలు

| కేటగిరి | బెనిఫిషర్స్ | అమౌంట్ (కోట్లలో) |
|---|---|---|
| బీసీ | 19516 | 29.27 |
| ఓసీ | 5628 | 8.44 |
| ఎస్టీ | 994 | 1.49 |
| మైనార్టీ | 1689 | 2.53 |
| ఓసీ కాపు | 2231 | 3.34 |
| ఓసీ నాన్ కాపు | 7418 | 11.12 |

### సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలు చేయాల్సిందే



చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు మహిళలు ఎక్కువగా ఆకర్షితులై ఓట్లేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు...సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక నాన్చుడు ధోరణి ప్రదర్శించడం సరికాదు. వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– రత్న కుమారి, మహిళా నాయకురాలు, కడప

### ఇద్దరి పిల్లలకు ఇస్తే మేలు...



మేము పేదవాళ్లం. నా భర్త పేరు శివప్రసాద్. మేము కడపలో నివాసం ఉన్నాము. మేమిద్దరం కూలి పనులకు వెళుతుంటాము. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరేమో 8వ తరగతి, మరొకరు 6వ తరగతి చదువుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెప్పినట్లు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత మందికి అమ్మకు వందనం కింద రూ. 15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. నా ఇద్దరు పిల్లలకు కలిసి రూ. 30 వేలు వస్తుంది. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. కానీ ఇంత వరకు ఊసే లేదు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల తెరిచిన వారంలోనే నా ఖాతాకు డబ్బులు పడేవి.

– బి. వెంకటరమణమ్మ, కడప

### రేపు జాబ్‌మేళా

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

### సీఆర్‌పీలకు భరోసా కల్పించాలి

**వైవీయూ:** పాఠశాల సముదాయాలు పునర్వ్యవస్థీకరణలో రద్దయిన స్కూల్ కాంప్లెక్స్ అనుబంధ సీఆర్‌పీలకు భరోసా కల్పించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. సీఆర్‌పీల్లో నెలకొన్న భయాందోళనలను నివారించి మాతృ మండలాలలోనే విధులు కొనసాగేలా చూడాలని కోరారు.

### నీటి సమస్యను పరిష్కరించాలి

**కడప కార్పొరేషన్:** కడప నగరంలోని వైఎస్సార్ పోలీస్ కాలనీ సమీపంలోని టిడ్కో–2, సరోజినీ నగర్ వద్దనున్న టిడ్కో–1, మామిళ్లపల్లె లేఅవుట్లలో ఉన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. నీటి సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన నీటి బోర్లను వినియోగించుకోవాలన్నారు.

### రైల్వే విచారణ, బుకింగ్ కార్యాలయాల మార్పు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కడప రైల్వేస్టేషన్‌లో ఇప్పటివరకు ఉన్న విచారణ కార్యాలయాన్ని తాత్కాలికింగ్ మార్పు చేసినట్లు రైల్వే స్టేషన్ అధికారి జనార్దన్ తెలిపారు. గురువారం నుంచి తాత్కాలికంగా విచారణ, బుకింగ్ కార్యాలయాలను రైల్వే రిజర్వేషన్ కార్యాలయంలోకి మార్చారని ఆయన వివరించారు.

## టార్గెట్ల పేరుతో వేధింపులు ఆపాలని నిరసన

**కడప వైఎస్సార్ సర్కిల్:** 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటి నుంచి ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో టార్గెట్ల పేరుతో అధికారులు చేస్తున్న వేధింపులు వర్ణనాతీమని అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్‌సీ–డివిజనల్ సెక్రటరి జీవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపులను ఆపాలని కోరుతూ నగరంలోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరిగిపోతున్న ఈ వేధింపులను భరించలేక అనేక మంది ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారు. అలాగే అప్పుల పాలవుతున్నారన్నారు. వ్యక్తిగతంగా దూషణలు చేయడం, దుర్భాషలాడటం, శెలవులు మంజూరు చేయక పోవడం, దూర ప్రాంతాలకు బదిలీ చేస్తామని వేధిస్తూ నియంతలాగా వ్యవహరిస్తున్నారన్నారు. అనేక పోస్టాఫీసులలో సిబ్బంది సరిగా కూర్చొని పనిచేయడానికి కనీస వసతులు లేవన్నారు. టార్గెట్స్‌కు యూనియన్స్ వ్యతిరేకం కాదని, టార్గెట్స్ అనేవి యూజర్ ఫ్రెండ్లీ గా ఉండాలని, వేధింపులు ఉండకూడదని తపాలా శాఖ ఉన్నతాధికారులతో పదే పదే చెబుతున్నప్పటికీ దానికి అధికారులు అంగీకరిస్తూనే వారి సొంత అభివృద్ధి అజెండాగా పెట్టుకొని కింది స్థాయి ఉద్యోగుల పైన వేధింపులు చేస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో డివిజనల్ యూనియన్ , పి.ఎ సలాం, పి. రాము, సర్కిల్ నాయకులు వి. భానుకృష్ణ, వి. గోవిందు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



తపాలాశాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## జీఓ 42ను రద్దు చేయాలని డిమాండ్

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల నిరసన

**వైవీయూ:** ప్రభుత్వ కళాశాలల్లో ఎయిడెడ్ అధ్యాపకులను విలీనం చేస్తూ జారీ చేసిన జీఓ 42ను రద్దు చేయాలంటూ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు నిరసన తెలిపారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో కళాశాల అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విలీనం చేయడంతో పదోన్నతులు, బదిలీల్లో ప్రభుత్వ అధ్యాపకులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పున:పరిశీలించి జీఓ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎయిడెడ్ విద్యాసంస్థలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఆర్థిక కార్యదర్శి డా. రామకృష్ణ, అధ్యాపకులు డా. ఎం. రమేష్, డా. సురేష్‌బాబు, డా. నాగేశ్వర్‌రెడ్డి, డా. మహేష్, డా. నాగేంద్ర, డా. వై. సావిత్రి, డా.బయపురెడ్డి, డా. నాగరాజు, డా. హజరతయ్య పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు

### ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికలు

**కడప స్పోర్ట్స్:** కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్‌రెడ్డి, సాజిత్, నిత్యప్రభాకర్, మహమ్మద్‌బాషా, విశ్వనాథ్, సుబ్బయ్య, వెంకటలక్ష్మి, చంద్రావతి, కోచ్‌లు అమృత్‌రాజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పవిత్రోత్సవాలు

**కడప కల్చరల్ :** కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం నుంచి కొనసాగుతున్న ఈ ఉత్సవాలలో భాగంగా చివరి రోజు పవిత్రాల సమర్పణతో కార్యక్రమాలు ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం 6.00 గంటల నుంచి పవిత్రాల విసర్జనలు, మహా పూర్ణాహుతి, చతుస్థాన ఉద్వాసనలు, కుంభ ప్రోక్షణ, పవిత్రాల వితరణ, విద్వత్ సంభావన తదితరాలను నిర్వహించారు.ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అర్చక బృందం పూజోత్సవాలు నిర్వహించారు. వేదమంత్రాల మధ్య పవిత్ర సమిధలను హోమంగుండంలో సమర్పించారు. అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చారు. అర్హులందరికీ పవిత్రాలను అందజేసి ఆశీర్వదించారు. సాయంత్రం 4.00 గంటల నుంచి దేవునికడప మాడవీధుల్లో స్వామి, అమ్మవార్లకు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.



పవిత్రాలతో వేద పండితులు

## మనోబంధు ఫౌండేషన్ కృషి అభినందనీయం

– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**కడప అర్బన్:** మానసిక దివ్యాంగులను గుర్తించి వారికి వైద్య చికిత్స అందించడం ద్వారా సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా మనోబంధు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమనీ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో మానసిక దివ్యాంగులను గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించేందుకు వీలుగా మనోబంధు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. మనో బంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ బి. రామకృష్ణంరాజు, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) ఎస్.ఎస్.వి కృష్ణారావు, మనోబంధు రీజనల్ కో–ఆర్డినేటర్ పి. శివారెడ్డి, మీకోసం సేవాసంస్థ అధ్యక్షుడు పి. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

## మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం కృషి

**వైవీయూ:** మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి కోరారు. బుధవారం గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు బాలవికాస్ గంగయ్య, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, బాబు, వెంకటసుబ్బయ్య, రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం**

మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరమని చింతకొమ్మదిన్నె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నారాయణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.